

ప్లేటులో గుడ్లు వెనక్కి.. అంగన్‌వాడీ సిబ్బంది సస్పెన్షన్

బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొప్పళ జిల్లా గుండూరు గ్రామ అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలకు ప్లేటులో గుడ్లు వడ్డించి వెనక్కి తీసుకున్నారు. పిల్లలందరినీ వరుసక్రమంలో కూర్చోబెట్టి అందరి ప్లేట్లలోనూ గుడ్లు వడ్డించారు. తినేందుకు సిద్ధమవుతుండగానే వాటిని వాపసు తీసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీ, సహాయకురాలు శెహనాజ్ బేగం ఇద్దరూ కోడిగుడ్లను వాపసు తీసుకుంటున్న వీడియో వైరలైంది. ఈ మేరకు స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ స్పందించి వారిద్దరినీ శనివారం సస్పెండ్ చేశారు.

పాఠకులతోనే పత్రికలకు మనుగడ

- మరో మూడు దశాబ్దాలు పత్రికలకు ఢోకా లేదు
- సోషల్ మీడియాకు ప్రామాణికత ఎక్కడ..?
- బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌లో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్



చర్చాగోష్ఠిలో ప్రసంగిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, పాల్గొన్న ఇతర సంపాదకులు

బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాఠకులతోనే పత్రికలకు మనుగడ అని, దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పత్రికలు నేటి ఆధునిక సమాజంలోనూ తిరుగులేని విధంగా కొనసాగుతున్నాయని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ తెలిపారు. బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌లో రెండో రోజు శనివారం 'సాహిత్యంపై మీడియా ప్రభావం' అనే అంశంపై చర్చాగోష్ఠిలో శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు మ్యాగజైన్లు సాహిత్యంతోనే అలరించాయన్నారు. క్రమేపీ వాటి ప్రభావం తగ్గేందుకు పలు కారణాలు ఉన్నాయని వివరించారు. వీటికి కొవిడ్ అనూహ్యమైన దెబ్బ తీసిందని విచారం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతి ప్రారంభం నుంచి సాహిత్యానికి ప్రాధాన్యం ఇస్తూనే వస్తోందని తెలిపారు. అన్ని తెలుగు పత్రికలు ఇదే విధానం అవలంబించాయని అన్నారు. సోషల్ మీడియా ద్వారా చిన్నపాటి కథలు, రీల్స్‌తో సందేశం ఇచ్చినా వాటికి ప్రామాణికత లేదన్నారు. పత్రికలో వచ్చే కథనానికి ఎడిటింగ్, సవరణలు వంటివి ఉంటాయని, ఆ విధానం సోషల్ మీడియా కథనాలకు లేదని తెలిపారు. మాతృభాషలో ఎప్పటికీ మార్పు ఉండదని, మరో మూడు దశాబ్దాలు పత్రికలకు ప్రాధాన్యం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నో పత్రికలు సాహిత్యాభిలాషతోనే శ్రీకారం చుట్టినా పరివర్తన చెందాయని హిందూ ఎడిటర్ భాగశ్రీ సుబ్బన్న వెల్లడించారు. వ్యాపారదృక్పథం కూడా పెరిగిందని తెలిపారు. మళయాళ ప్రిజమ్ బుక్స్‌కు చెందిన సుధీర్ ప్రసంగిస్తూ కొవిడ్ తర్వాత మళయాళంలో ఇప్పుడు సాధారణ పరిస్థితి వచ్చిందని, ఏడాదికి ఏడెనిమిదివందల పుస్తకాలు ప్రచురితం అవుతున్నాయన్నాని వివరించారు. సాహిత్య పర్యవేక్షణలో నాణ్యత ఉంటుందన్నారు. ప్రపంచంలో సాహిత్యమనేది మైనారిటీయే అయినా ప్రతి పుస్తకం ఒక సందేశం ఇస్తుందన్నారు. మరో చర్చాగోష్ఠిలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మానస ఎండ్లూరి సమాజంలో వెనుకబడిన మహిళల సమస్యలపై సుదీర్ఘంగా మాట్లాడారు. నేటికీ మారుమూల ప్రాంతాల్లో మహిళలు అనాగరికంతోనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య పెరిగితేనే మహిళల్లో మార్పు సాధ్యమవుతుందన్నారు. సమకాలీన తెలుగు నవల అనే అంశంపై అక్కినేని కుటుంబరావు, సన్నపురెడ్డి, వెంకటరామిరెడ్డి, సుధాకర్ ఉందుర్తి, అరవింద్ మాట్లాడారు. రెండోరోజు బుక్ బ్రహ్మలో ఐదు వేదికల ద్వారా పదుల సంఖ్యలో పుస్తకావిష్కరణలు, చర్చాగోష్ఠులు, చిన్నారుల స్టోరీ టెల్లింగ్ వంటి కార్యక్రమాలు కొనసాగాయి.



చర్చాగోష్ఠిలో పాల్గొన్న నటుడు ప్రకాశ్‌రాజ్



చర్చాగోష్ఠిలో పాల్గొన్న సాహిత్యాభిమానులు

ఇకపై భూ అక్రమాలకు చెక్

ఈసీలకు ఆధార్ అనుసంధానం
ఇప్పటికే 70శాతం పూర్తి




బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గడిచిన నాలుగైదు దశాబ్దాలతో పోలిస్తే ప్రతి పదేళ్లకు భూమి విలువ పెరుగుతూ వచ్చింది. ఎకరం వందలు పలికిన భూమి లక్షల స్థాయికి చేరింది. ఈ పరిణామం భూ అక్రమాలకు అమాంతంగా తెరలేచింది. దౌర్జన్యాలు, సాంకేతికమైన లొసుగులు, డిజిటల్ ద్వారా మార్పులు, కొంతమంది అధికారుల స్వార్థం వంటి కారణాలతో పల్లె నుంచి నగరం దాకా భూ అక్రమాల వివాదాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో వ్యవసాయ భూమిలో అనధికారికంగా లే అవుట్‌ల నిర్మాణం తలెత్తుతోంది. వీటన్నింటికి పరిష్కారం చూపేలా రాష్ట్రప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఆధార్ అనుసంధానం తీసుకొస్తోంది. రాష్ట్రంలో సుమారు 4 కోట్ల భూఖాతాలు ఉండగా వీటిలో 2.75 కోట్ల ఖాతాలకు ఆధార్ అనుసంధానం పూర్తయ్యింది. సుమారు 70శాతం దాకా ప్రక్రియ కొనసాగింది. కొన్ని జిల్లాల్లో అతివృష్టి కారణంగా జూలై నుంచే అనుసంధాన ప్రక్రియకు అంతరాయం కలిగింది. ఈ విధానం పూర్తయితే రాష్ట్రంలో చిన్న, మధ్యతరగతి రైతులు ఎంత మంది ఉన్నారనేది తెలుస్తుంది. ప్రభుత్వం అందించే సహాయం, సబ్సిడీ లబ్ధిదారులను స్పష్టంగా గుర్తించవచ్చు. భూరికార్డులకు ఆధార్ అనుసంధానంతో మృతి చెందినవారి పేరిట ఉన్న సుమారు 35 లక్షల ఖాతాలతోపాటు నాలుగైదు దశాబ్దాలుగా పూర్వీకుల పేరిట ఉన్న ఈసీలకు సవరణలు చేసి వారసులకు రికార్డులు మార్పు చేశారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూమి రెవెన్యూశాఖ డేటా బేస్‌లో అగ్రికల్చర్‌గానే నమోదైంది. అనధికారికంగా లే అవుట్‌లు ఏర్పడి ఇళ్లనిర్మాణాలు కొనసాగాయి. ఇంటి స్థలాలు విక్రయించి ఆ తర్వాత అదే భూమిని వ్యవసాయ భూమిగానే మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి మోసాలకు పాల్పడిన ఉదంతాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి హోబళి, తాలూకా కేంద్రాలలో ఇటువంటి మోసాలు కొనసాగుతున్నాయి. భూ అక్రమాలకు సమగ్రంగా చెక్ పెట్టేలా రెవెన్యూ విభాగం వ్యవహరిస్తోంది. భూ రికార్డులకు ఆధార్ అనుసంధానం చేయడంతో రాష్ట్రంలో రైతుల సంఖ్య, సాగు భూమి, మహిళా రైతుల వివరాలు తేలనున్నాయి. జిల్లా, తాలూకా, గ్రామస్థాయిలో స్పష్టత రానుంది. కేంద్రప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 44 శాతం మంది చిన్నకారు, సన్నకారు రైతులు ఉన్నట్టు తెలుస్తున్నా ఇది 70 శాతందాకా ఉన్నట్టు ఒక అంచనా. రెవెన్యూశాఖ నిరంతరంగా ఈ ప్రక్రియ కొనసాగిస్తోంది. తప్పుడు రికార్డులతో అక్రమాలకు పాల్పడేవారి నుంచి భూ యజమానులకు రక్షణ లభించనుంది. బ్యాంకు రుణంతోపాటు ఇతరత్రా సౌలభ్యాలు పొందేందుకు రైతులకు అనుకూలం కానుంది. భూపరివర్తన, బ్లూప్రింట్ లేకుండా అనధికారికంగా నిర్మాణాలు, లే అవుట్‌ల ఏర్పాటుకు ఇకపై సాధ్యం కాదు. ఆధార్ అనుసంధాన ప్రక్రియలో 35 లక్షల మంది మృతి చెందినవారి పేరుతోనే భూ రికార్డులు ఉన్నాయి. కుటుంబ పెద్ద మరణించగానే పంపిణీ చేసుకుంటే వివాదాలు వస్తాయని, ఎవరికివారుగా వారసులు కుటుంబీకులు, బంధువుల సమక్షంలో పంపిణీ చేసుకుని సాగు చేసుకుంటుంటారు. వీరి వారసుల్లో ఎవరైనా అన్యాయం జరిగిందని కోర్టుకు వెళ్తే సమస్య తీవ్రమై పెను వివాదాలకు కారణం కానుంది. ఇలాంటి ప్రక్రియలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ఆధార్ అనుసంధానం చేస్తున్నట్టు రెవెన్యూశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



బెంగళూరు ఎయిర్‌పోర్టుకు 7 ప్రతిష్టాత్మక అవార్డులు

బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏడు ప్రతిష్టాత్మక అవార్డులు దక్కాయి. కాలిఫోర్నియాలో జరిగిన ప్రతిష్టాత్మక ఎయిర్‌పోర్ట్స్, ఫుడ్, బెవరేజ్‌తోపాటు హాస్పిటాలిటీ కాన్ఫరెన్స్ తదితర విభాగాల్లో పురస్కారాలు దక్కాయి. బీఐఏఎల్ శనివారం ప్రకటించిన సమాచారం మేరకు ఎయిర్‌పోర్ట్‌లో ఫుడ్, బెవరేజ్, హాస్పిటాలిటీ విభాగంలో నాణ్యత, గుణాత్మకతకు అవార్డులు వచ్చాయి. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్-2లో 080 డొమెస్టిక్ లాంజ్ ప్రారంభమైందని, ఏడాదిలోనే ఉత్తమ అవార్డు దక్కిందని బీఐఏఎల్ ప్రకటించింది. రాష్ట్ర సంస్కృతి, పరంపర ప్రతిబింబించేలా రూపొందించడంతో ప్రయాణికులకు ప్రత్యేక అనుభూతి ఇస్తోందన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో తొలి మిట్టి కెఫెలను ప్రారంభించామని, ఇది దివ్యాంగులైన ప్రయాణికులకు ప్రత్యేక ప్రయోజనకారి అవుతోందన్నారు. ఇందుకుగాను మానవీయ ప్రశస్తి దక్కిందన్నారు. ఈ మేరకు బీఐఏఎల్ చీఫ్ కెన్నత్ గుల్డ్‌బెర్గ్ మాట్లాడుతూ ఫుడ్,బెవరేజ్ అవార్డులో ఉత్తమ పురస్కారం దక్కిన తొలి భారతీయ విమానాశ్రయమం అన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ఏటా 25 మిలియన్ల ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. స్పెషల్‌థీమ్‌తో కేఐఏ టెర్మినల్-2 ప్రారంభమయ్యాక అత్యధిక పురస్కారాలు దక్కిన దేశంలోనే అతిపెద్ద మూడో ఎయిర్‌పోర్ట్‌గా నిలిచిందన్నారు.



సముద్రంలోకి.. భూభాగం

2040 నాటికి 5 శాతం కలిసిపోతుంది
ప్రమాదంపై హెచ్చరించిన బెంగళూరు శాస్త్రవేత్తలు



బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలతో కొండ చరియలు విరిగిపడి ప్రమాదాలు తీవ్రమవుతున్న నేపథ్యంలోనే మరో ఆందోళన కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలోని ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాల తీరప్రాంతంలో భూభాగం సముద్రంలోకి చేరనుందని నిపుణులు హెచ్చరించారు. రాష్ట్రంలో మూడు జిల్లాల పరిధిలో సముద్రతీరం ఉంది. ఇందులో ఉడుపి, మంగళూరు పరిధిలో 5శాతం భూమి 2040నాటికి కలసిపోనుందని బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్తలు తెలిపారు. సముద్రం ఏటా విస్తరిస్తోందని వెల్లడించారు. ఇటీవలే శాస్త్రవేత్తల బృందం పరిశోధనలు జరిపింది. వారి నివేదిక ప్రకారం కాలానుగుణంగా సముద్రమట్టం పెరగనుందని తెలుస్తోంది. పశ్చిమతీరంలోని నగరాలు మునిగే అవకాశం ఉందని హెచ్చరించారు. కొన్నేళ్ల క్రితం సముద్రతీరంలోని ఇళ్లు అలల కారణంగా కొట్టుకుపోయాయి. వాతావరణంలో మార్పులు, తీరం పొడవునా మానవాళి తప్పిదాలు పెరుగుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న సముద్రప మట్టం ద్వారా వసతి, సాగు ప్రదేశాలను ఆక్రమించనుందన్నారు. భవిష్యత్తులో వరదలకు కారణం కావచ్చని హెచ్చరించారు. శాస్త్రవేత్తల బృందం అలల అంతరాన్ని బేరీజువేసింది. మంగళూరు విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ కేఎస్ జయప్ప సంభావ్య ప్రమాదాలకు సంబంధించిన నివేదికను ఇచ్చారు. తీరంలో అడ్డుగోడలు, కట్టడాలను దాటి అలలు వస్తున్నాయని, అలలదాటిని తట్టుకునేందుకు రాళ్లను ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు దిక్కును మార్పు చేస్తుందన్నారు. సముద్రమట్టం భూమిపై ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. మంగళూరుకు అనుబంధంగా ఉండే సోమేశ్వర, ఉచ్చిళ, ససిహిత్లు ప్రదేశాల్లో ఎక్కువ భూభాగం సముద్రంలోకి చేరనుందని, ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. ఉడుపి, దక్షిణకన్నడ, కేరళ, గోవాతోపాటు మహారాష్ట్రలోని పశ్చిమతీరంలో ఇదే తరహాలో మార్పులు సంభవించే అవకాశం ఉందని నివేదికలో ప్రస్తావించారు. నివేదిక ప్రకారం ముంబై, పాండిచ్చేరి, ట్యూటికోరన్‌లలో కొంతమేర భూమి సముద్రంలో కలిసే అవకాశం ఉందని వెల్లడించారు. పర్యావరణ సమతుల్యత లేకపోవడం, పరిసరాలను సమగ్రంగా సంరక్షించకపోవడం వంటి కారణాలతో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని నివేదికలో అభిప్రాయపడ్డారు. దీన్ని తీవ్రంగా పరిగణించాలని, ప్రకృతి వైపరీత్యాలను ధీటుగా ఎదుర్కోవాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు.

ఆరునెలల్లో సగంమంది జైలుకే

బీజేపీ, జేడీఎస్ నాయకులపై మంత్రి ప్రియాంక ఖర్గే



బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో అక్రమాలపై విచారణలు వివిధ దశల్లో ఉన్నాయని ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే కొత్తబాంబు పేల్చారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మధ్యంతర నివేదికలపై పరిశీలన జరుపుతున్నామని అన్నారు. వీటి ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. మరో ఆరు నెలల్లో బీజేపీ, జేడీఎస్‌కు చెందిన సగంమంది ముఖ్యనేతలు జైళ్లలో ఉంటారని, మిగిలిన సగంమంది బెయిల్‌పై ఉంటారని వ్యాఖ్యానించారు. గవర్నర్ ద్వారా ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర సాగుతోందని ఆరోపించారు. ఎవరో ఫిర్యాదు చేస్తే గవర్నర్ షోకాజ్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. మాజీ మంత్రి మురుగేశ్ నిరాణిపై ఫిర్యాదు చేస్తే గవర్నర్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గవర్నర్‌కు ఎక్కడి నుంచి సూచనలు వస్తున్నాయన్నారు. కొన్ని రాష్ట్రాల గవర్నర్లు హోదాకు తగినట్టు వ్యవహరించడం లేదని, కోర్టులు మందలించే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

పెచ్చులూడిపడి విద్యార్థులకు గాయాలు

రాయచూరు, ఆగస్టు 10 : రాయచూరు తాలూకాలోని ఉడమగల్ ఖానాపూర్ వద్ద ఉన్న బీసీఎం ప్రీమెట్రిక్ వసతి పాఠశాలలో పైకప్పు పెచ్చులూడిపడడంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి విద్యార్థులు భోజనం అనంతరం గదిలో కూర్చుని చదువుకుంటుండగా అకస్మాత్తుగా పైకప్పు పెచ్చులూడిపడ్డాయి. ఆ సమయంలో ముగ్గురు విద్యార్థులపై పెచ్చులు పడడంతో గాయాలైయ్యాయి. వెంటనే వసతి నిలయం సిబ్బంది వారిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన విద్యార్థుల్లో జులుముగేరాకు చెందిన గురువేశ్, వడ్లూరుకు చెందిన కార్తీక్, కిరణ్ ఉన్నారు. వీరంతా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులే. కిరణ్‌కు మామూలు గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అందించి వెంటనే హాస్టల్‌కు పంపించారు. మిగతా ఇద్దరికి తలకు బలంగా గాయాలు తగలడంతో ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నట్లు శనివారం రిమ్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



ముగింపు సభలో బీజేపీ, జేడీఎస్ నేతల ఐక్యతారాగం

అవినీతి ముఖ్యమంత్రిపై మా పోరాటం ఆగదు

- సర్కార్ సొమ్ముతోనే కాంగ్రెస్ సభలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర
- కెఫే సిద్ధార్థ హెగ్డే మృతికి కారకులు ఎవరు..?
- డీకేపై కేంద్రమంత్రి కుమారస్వామి ఆరోపణలు

ముగిసిన బీజేపీ, జేడీఎస్ పాదయాత్ర

బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి)

అవినీతి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా తమ పోరాటం ఆగదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర స్పష్టం చేశారు. ముడాలో 14 ఇంటి స్థలాలను సీఎం సిద్దరామయ్య భార్య పేరిట మంజూరు, ఇతర అక్రమాలను నిరసిస్తూ వారం రోజులపాటుసాగిన చలో మైసూరు పాదయాత్ర ముగింపు సభ శనివారం మైసూరు మహారాజ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ యడియూరప్ప పట్ల పరుషంగా మాట్లాడడం వీడాలని, లూటీని అంగీకరించి సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి పెరిగిందన్నారు. ముడాలో రూ.5వేల కోట్ల అక్రమాలు జరిగాయన్నారు. సీఎం, డీసీఎం బెదిరింపు ధోరణి వీడాలన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్ల రూపాయల నగదు బదిలీ అవినీతి కాదా అని ప్రశ్నించారు. ముడాలో అంతా సజావుగా జరిగిందా..? అని నిలదీశారు. యడియూరప్పను చూస్తే వారికి వణుకు పుడుతోందన్నారు. సిద్దరామయ్యపై తాము పోరాటం చేయడం లేదని, అవినీతి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఎంతటికైనా వెనుకాడేది లేదన్నారు. భూమి అక్రమంగా కొనుగోలు చేసి భార్య పేరిటకు మార్చి విలువైన చోట ఇంటి స్థలాలు పొందారని ఆరోపించారు. 15 నెలల్లో మీరు చేసిన అభివృద్ధి చెప్పగలరా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో గత ఏడాది అనావృష్టితో 1500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఎంతమందికి న్యాయం చేశారని అన్నారు. శాసనసభలో సమాధానం చెప్పడంలేదని అందుకే పాదయాత్ర ద్వారా రాష్ట్ర ప్రజలకు అక్రమాలు వివరించామని తెలిపారు. ఈనెల 3న ప్రారంభమైన పాదయాత్రకు ప్రతిరోజూ వేలాదిమంది తరలివచ్చారని వివరించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజకీయ జీవితమంతా అవినీతిమయమేనని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ సీఎం యడియూరప్ప, కేంద్రమంత్రి కుమారస్వామి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి సహా ప్రముఖులు పాల్గొన్నారు.


సత్తా ఉంటే శాసనసభను రద్దు చేయండి

సత్తా ఉంటే శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు రావాలని మాజీముఖ్యమంత్రి యడియూరప్ప సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. తన జీవితకాలం రాజకీయాల్లో ఉంటానని, మిమ్మల్ని ఇంటికి పంపేవరకు నిద్రపోయేది లేదన్నారు. శివకుమార్ పాపాలు పండుతున్నాయన్నారు. లూటీ వారి లక్ష్యంగా మారిందన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామి మాట్లాడుతూ తన సారథ్యమంటూ గొప్పలు పోయే శివకుమార్ లోక్‌సభ ఎన్నికల్లో 9 స్థానాలే ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. దళిత కుటుంబాలపై దౌర్జన్యం చేశారన్నారు. కొత్వాల్ రామచంద్ర కాళ్లు పట్టిన వీడియోలు ప్రదర్శించారు. తిహార్ జైలుకు వెళ్లింది ఏమి సాధించినందుకు అని ప్రశ్నించారు. తన కొడుకు రాజకీయం కోసం అన్నకొడుకును జైలుకు పంపేంతటి నీచమైన పనులు చేయబోనన్నారు. ఎవరి ఇళ్లను ఎవరు కొల్లగొట్టారో అందరికీ తెలుసు అన్నారు. ఎస్ఎం కృష్ణ అల్లుడు, కెఫె కాఫీడే ముఖ్యులు సిద్ధార్థ హెగ్డే ఆత్మహత్యకు కారణం ఎవరని ప్రజల ముందు చెబుతారా..? అని సవాల్ విసిరారు. ఆయన ఆత్మహత్యకు డీకే శివకుమార్ కారణమని ఆరోపించారు. మాజీ ప్రధాని దేవెగౌడ ఆస్తులు గురించి ప్రశ్నించే ముందు ఆయన రాజకీయాలకు రాకముందే ఇంజనీర్ అని, మీ తండ్రి ఏం చేసేవారని ప్రశ్నించారు. మీ తండ్రి కెంపేగౌడ ఊళ్లో కూలిపనులు చేశారని, ఒక్కసారిగా ఇంత ఆస్తి ఎక్కడి నుంచి వచ్చిందన్నారు. పలువురు నాయకులు సభలో మాట్లాడారు. పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.



సభకు హాజరైన కార్యకర్తలు

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు



	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1633.00	1,628.63
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	40,925	22,378
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	28,133	9,442
సామర్థ్యం (టీఎంసీలు)	105.79	89.01

15న నగరంలో రైతుల ట్రాక్టర్ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 10: రైతులే దేశానికి వెన్నెముక అని చెబుతున్న ప్రభుత్వం నుంచి రైతులకు ఉపయోగం ఒనగూరలేదని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 15న ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించనున్నట్లు రైతు యూనియన్ నాయకుడు శాంతకుమార్ తెలిపారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బియ్యం ఎగుమతి నిబంధలను సడలించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు ఆధార్ అనుసంధానం చేయవద్దని కోరారు. ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయం పెరిగిందని, కాని పంట ధరలు పెరగ క పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనుక స్వామినాథన్ నివేదిక ప్రకారం కనీసం మద్దతు ధర అమలు చేయాలన్నారు. తదనంతరం శరణప్ప మాట్లాడుతూ తుంగభద్ర జలాశయంలో పూడిక సమస్య పరిష్కారానికి సమాంతర కాలువ నిర్మించాలన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు లేపాక్షి ఆసుండి లక్ష్మీదేవి, శ్రీనివాస్ పాళ్య, కొట్రేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలన్నీ కార్పొరేట్‌ల సేవకోసమే!



సదస్సులో మాట్లాడుతున్న దేవదాస్

బళ్లారి సిటీ, ఆగస్టు 10: పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులన్నింటినీ తుంగలో తొక్కుతూ దేశంలోని అన్ని ప్రభుత్వాలు కార్పొరేట్లకు సేవ చేస్తున్నాయని ఏఐయూటీసీ జిల్లా అధ్యక్షుడు ఏ.దేవదాస్ అన్నారు. శనివారం నగరంలోని గాంధీభవనంలో ప్రథమ తాలూకా స్థాయి ఆశా కార్యకర్తల సదస్సులో ఆయన మాట్లాడారు. మాన హక్కులను కాపాడుకోవడానికి ఆశా కార్యకర్తలు సహా మొత్తం కార్మిక వర్గం వారి పోరాడాలన్నారు. పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా తమ గళాన్ని పెంచాలన్నారు. ఈసందర్భంగాఏఐయూటీసీ శాంత మాట్లాడుతూ ఆశాకార్యకర్తల జీవితాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదన్నారు. వేదికపై లక్ష్మి, జిల్లా కార్యదర్శి గీత,బళ్లారి తాలూకా అధ్యక్షులు లక్ష్మీదేవి,కార్యదర్శి యశోద,పుష్ప, ఈరమ్మ, పావని, శశికళ,సహన, రేఖ, వనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రగతికి ఉపాధ్యాయులు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీం నాగరాజు

సిరుగుప్ప, ఆగస్టు 10 : విద్యాప్రగతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు పిలుపునిచ్చారు. సిరుగుప్ప పట్టణం ప్రభుత్వ పాఠశాలలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఇంగ్లీష్ బోధనలో శిక్షణకు ఆయన శ్రీకారంచుట్టారు. ప్రభుత్వపథకాలు అందరికీ అందేలన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి గురప్ప, శిక్షణ సంయోజకులు తమ్మన్నగౌడ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో జీవేంద్రప్ప స్మారక పోటీలు

బళ్లారి సిటీ, ఆగస్టు 10 : శ్రీమతి బసమ్మ పాఠశాలలో శ్రీమతి లక్ష్మిజీవేంద్రప్ప సంస్మరణార్థం విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని మహానగరపాలిక మేయర్ నందీశ్ ప్రారంభించి మాట్లాడారు. మహానగర పాలిక అల్పసంఖ్యాకుల నిధుల కింద విడుదలచేసే నిధులను పాఠశాల భవనాల అభివృద్ధికి సమకూరుస్తామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాజేశ్వరి మాట్లాడుతూ తమ మామగారు స్థాపించిన పాఠశాలలను అభివృద్ధి చేయడానికి శ్రమిస్తానన్నారు. విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

రేపటి నుంచి రయ్.. రయ్..

● కంప్లి- గంగావతి బ్రిడ్జిపై టూవీలర్స్‌కు అనుమతి ● వంతెనపై ఇనుప కంచె ఏర్పాటు

కంప్లి, ఆగస్టు 10 : కంప్లి కోట వద్ద తుంగభద్ర నది వంతెనపై ఎట్టకేలకు సోమవారం నుంచి ద్విచక్ర వాహనాల రాకపోకలను అనుమతించనున్నారు. గత 15 రోజులుగా వంతెనపై ప్రయాణం పూర్తిగా బంద్ కావడంతో రైతన్నలు, విద్యార్థులు, ప్రయాణికులు పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏడు రోజుల క్రితం నడక ప్రయాణానికి మాత్రం అనుమతివ్వడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయినప్పటికీ కంప్లి నుంచి గంగావతికి వెళ్లేవారు వంతెనపై చిక్కజంతిగల్ వరకు నడుచుకుంటూ వెళుతున్నారు. కంప్లి వైపు వచ్చే వారు కూడా వంతెనపై కాలినడకన వస్తున్నారు. విద్యార్థులతో ప్రత్యేకంగా తల్లిదండ్రులే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులను తీసుకెళ్లి తిరిగి సాయంత్రం విద్యార్థులను వంతెనపై నుంచి తీసుకువస్తున్నారు. వంతెనపై ఇరువైపులా రక్షణగా వుండే ఇనుపకడ్డీలు పూర్తిగా ధ్వంసం కావడంతో రోడ్డు శాఖ అధికారులు రక్షణ కోసం ఇనుప కంచెను సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా గంగావతి పీడబ్ల్యూడీ అధికారులు విశ్వనాథ్ మాట్లాడుతూ తాత్కాలికంగా రెండు వైపులా రక్షణకు ఇనుప రాడ్డులను ఏర్పాటు చేస్తున్నామని, ఉన్నతాధికారులతో చర్చించి నీటి ప్రవాహాన్ని దృష్టిలో వుంచుకుని సోమవారం నుంచి ద్విచక్రవాహనాలను వంతెనపై వెళ్లేందుకు అనుమతిస్తామన్నారు. అలాగే వంతెనపై కాలినడకన వెళ్లేవారు సెల్ఫీలు తీసుకుంటుండటంతో ఇతరులు ఇబ్బంది పడుతున్నారు.



విద్యార్థులను వంతెనపై కాలినడకన తీసుకెళుతున్న తల్లిదండ్రులు



వంతెనపై రక్షణకంచెను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పొంగిపొర్లుతున్న గంజళ్ళి వాగు

● శక్తినగర్-గంజళ్ళి మధ్య నిలిచిపోయిన రాకపోకలు

రాయచూరు, ఆగస్టు 10 : తాలూకాలోని గంజళ్ళి వాగు పొంగిపొర్లుతోంది గడచిన రెండు రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో ఈ వాగుకు ఒక్కసారిగా వరద ఏరులా వచ్చి చేరింది. దీంతో శనివారం శక్తినగర్-గంజళ్ళి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గంజళ్ళితో పాటు పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ప్రతి రోజు శక్తినగర్‌కు రాకపోకలు సాగించాల్సి ఉండగా గంజళ్ళివాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వివిధ అవసరాల కోసం శక్తినగర్‌కు వెళ్లే వారు దాదాపు 87 కిమీ దూరం చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తుందంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో వాగుపై వంతెన నిర్మించాలని గడచిన అనేక ఏళ్లుగా తాము కోరుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే దుస్థితిని అనుభవిస్తున్నామంటూ గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

కృష్ణానదికి తగ్గిన వరద

నారాయణపూర్ జలాశయం నుంచి దిగువకు నీటిని తక్కువగా విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానదికి వరద ప్రవాహం తగ్గు ముఖం పట్టింది. నారాయణపూర్ జలాశయానికి శనివారం ఇన్‌ఫ్లో కూడా తగ్గుముఖం పట్టడంతో అధికారులు నీటి విడుదలను కూడా లక్ష క్యూసెక్కులకు తగ్గించారు. ఈ క్రమంలో జిల్లా సరిహద్దులో ప్రవహిస్తున్న కృష్ణానదిలో నీటిప్రవాహం తగ్గింది. దీంతో తీర గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కాగా నదీ ప్రవాహం మరో సారి పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.



నారాయణపూర్ జలాశయం నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

అధిక ఫీజు వసూలుచేసే పాఠశాలలపై చర్యలు

కంప్లి, ఆగస్టు 10 : తాలుకాలో సెంట్రల్ సిలబస్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కర్ణాటక రక్షణ వేదిక నారాయణ గౌడ సంఘం కుడితిని అధ్యక్షుడు బాబు శివకుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా శిక్షణ శాఖ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడితిని ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు డిగ్రీ, ఇంటర్మీడియట్ చదివిన వారితో బోధన చేయిస్తూ దీన్ని వ్యాపారంగా మార్చారన్నారు. ఉత్తమ శిక్షణ లేకున్నా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. పాఠశాల నిర్వహణ ఒక వ్యాపారంగా మారిందన్నారు. పాఠశాలల్లో సెంట్రల్ సిలబస్ పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అక్కడ సెంట్రల్ సిలబస్ బోధించకపోయినప్పటికీ అధిక ఫీజులు దండుకుంటున్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము ఇచ్చిన మనవిపత్రంలోని విషయాలపై తాలుకా స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి వెంటనే అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని శిక్షణ శాఖ అధికారి ఉమాదేవి తెలిపారన్నారు. వారితో పాటు రక్షణ వేదిక సంఘం అధ్యక్షులు తిమ్మప్ప తదితరులు వున్నారు.



జిల్లా శిక్షణ శాఖ అధికారి ఉమాదేవికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

దేశ సర్వతోముఖాభివృద్ధికి యోగా


● పతంజలి యోగా సమితి రాష్ట్ర ఇన్‌చార్జి భవరలాల్

బళ్లారి సిటీ, ఆగస్టు 10: దృఢమైన శరీరం వంటి బలమైన భారతదేశాన్ని నిర్మించడం దేశంలోని ప్రతిపౌరుని కర్తవ్యమని, ఈదిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పతంజలి యోగా కమిటీ రాష్ట్ర ఇన్‌చార్జి, యోగా గురువు భవరలాల్ ఆర్య అన్నారు. హొసపేటలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న యోగా శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం ఆయన ప్రసంగించారు. సనాతన ధర్మంతో కూడిన భారతదేశాన్ని ముక్కలు చేయాలని కలలుకంటున్న వారికి మన సంస్థ ఆరోగ్యసంఘం ద్వారా సమాధానం చెప్పాలన్నారు. 25రోజుల శిక్షణా శిబిరం యువతరం వికాసానికి నాంది కావాలని, శిక్షణ పొందినవారు బాధ్యతతో, సంకల్పబలంతో దానిని సార్థకం చేసుకోవాలన్నారు. యోగా మన జీవితపు సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. హొస్పేట్ లో బ్రహ్మాండమైన యోగాభవన్ నిర్మించవచ్చునని, ఇక్కడున్న ప్రతి ఒక్కరూ తలచుకుంటే వచ్చే గురుపూర్ణిమకు ఇది గురుకానుకగా మారడంలో ఆశ్చర్యం లేదన్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ యోగా శరీరక, మానసిక ఆరోగ్యాలను కాపాడుతుందన్నారు. యోగాపై సమాజంలో అవగాహన కల్పించేందుకు మీడియా నిరంతరం ప్రయత్నిస్తుందన్నారు. తదనంతరం యోగా గురువు బావర్‌లాల్ ఆర్య హంపి కన్నడ విశ్వవిద్యాలయం యోగా అధ్యయన కేంద్రం అధిపతిని పతంజలి యోగా సమితి రాష్ట్ర సభ్యునిగా ప్రకటించారు. యోగా శిబిరంపై క్యాంపస్ జర్నలిస్టు బాలకృష్ణ, సుజాత కర్ణం, మల్లికార్జున తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈసందర్భంగా విలేకరులను భవరలాల్ సత్కరించారు. ఈసందర్భంగా యువభారత జిల్లా అధినేత వీరేశ్, సీనియర్ యోగాభ్యాసకులు చాలచంద్రశర్మ, కృష్ణానాయక్, మంగళక్క,అనంతజోషి, శ్రీనివాసమంచికట్ట, శ్రీరామ్, ప్రమీలమ్మ,జిల్లా మహిళా నాయకురాలు కూడ్లిగి గౌరమ్మ, చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.



పాత్రికేయులను సత్కరిస్తున్న భవరలాల్ ఆర్య తదితరులు

అంజనాద్రికి ప్రత్యేక బస్సులు



భక్తులతో కిటకిట లాడుతున్న అంజనాద్రి కొండ

బళ్లారి సిటీ, ఆగస్టు 10: శ్రావణమాసం రద్దీ నేపథ్యంలో హొసపేట నుంచి గంగావతి తాలూకా అంజనాద్రి కొండకు శనివారం నుంచి వారానికి రెండు రోజులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు హొసపేట ఆర్టీసీ అధికారి తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 9నుంచి రాత్రి 7గంటల వరకు హొసపేట బస్టాండు నుంచి బస్సులను నడుపుతామన్నారు. ఈ బస్సులు హులిగి, శివపుర, సోమేశ్వర మీదుగా అంజనాద్రికి చేరుకుంటాయన్నారు. అంజనాద్రి కొండకువెళ్ళే భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో కొండకు భక్తుల రద్దీపెరిగింది.

వైభవంగా సుంకులమ్మదేవి ప్రతిష్ఠ

కంప్లి, ఆగస్టు 10 : తాలుకా పరిధిలోని చిక్కజంతిగల్ గ్రామంలో సుంకులమ్మదేవి నూతన ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన, కలశధారణ ఘనంగా జరిగినట్లు పురోహితులు లక్ష్మణ్ణ తెలిపారు. వివిధ హోమాలు, గంగపూజ, పంచామృతాభిషేకం అనంతరం భాజాభజంత్రీల నడుమ ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో హెబ్బాళ మఠ నాగభూషణ శివాచార్యులు, హులికల్లు భువనేశ్వర్ తాత పాల్గొన్నారు. ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో చిక్కజంతిగల్, కంప్లి, కోట, గంగావతి తదితర గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన సుంకులమ్మదేవి

శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వరదాంజనేయస్వామి

బళ్లారిరూరల్, ఆగస్టు 10 : శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా వరద అభయాంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. బళ్లారి వెంకటేశ్వరనగర్‌లో వెలసిన స్వామివారి కి గంధంతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో నగరంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు.

12న హర్ ఘర్ తిరంగా అభియాన్

బళ్లారి సిటీ, ఆగస్టు 10: జిల్లాయంత్రాంగం, పంచాయితీ, కన్నడ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఈనెల 12వ తేదీ సాయంత్రం హర్‌ఘర్ తిరంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కన్నడ సాంస్కృతిక శాఖాధికారి నాగరాజు తెలిపారు. స్థానిక రాజ్‌కుమార్ రహదారిలోని కన్నడ సముచ్ఛయ భవన నాడోజ సుభద్రమ్మ మన్సూర్ బయలు రంగమందిరంలో వివిధ కళాకారులు, విద్యార్థులచే దేశభక్తి పాటలకు నృత్య ప్రదర్శన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నగర సభకు ఐదుగురు సభ్యుల నియామకం



నగరసభకు నియమితులైన సభ్యులు

సిరుగుప్ప, ఆగస్టు 10 : సిరుగుప్ప నగర సభకు ఐదుగురు సభ్యులను నామినేట్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బీఎం నాగరాజు సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం సిరుగుప్ప నగరసభకు మరిరాజగౌడ, మురళికృష్ణ, నజీర్ అహ్మద్, పర్వీన్, సరస్వతిలను నామినేటెడ్ సభ్యులుగా నియమించారు.

గాలిమరల టెక్నీషియన్ మృతి

బెళుగుప్ప, ఆగస్టు 10: మండలంలోని నక్కలపల్లి గ్రామ సమీపంలో గాలి మరల టెక్నీషియన్ టీ వీరేష్ (32) ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారి జిల్లా సిరిగెర గ్రామానికి చెందిన వీరేష్ ఏడాది క్రితం సుజలాన్ గాలిమరల కంపెనీలో టెక్నీషియన్‌గా చేరాడు. నక్కలపల్లి సమీపంలో గాలిమరల ఫ్యాన్ పనిచేయకపోవడంతో శుక్రవారం సాయంత్రం మరమ్మతు చేయడానికి పైకిఎక్కాడు. అక్కడ సమస్యను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కిందకుపడి తీవ్రంగా గాయపడ్డాడు. సిబ్బంది వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.



మృతి చెందిన వీరేష్

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి

కంప్లి, ఆగస్టు 10 : విద్యార్థులు విద్యాభ్యాసానికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందడుగు వేసి గుర్తింపు పొందాలని పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు మంజునాథ్ తెలిపారు. ఆగస్టు 15 వేడుకల సందర్భంగా విద్యార్థులకు నాటకాలపై, సాంస్కృతిక రంగాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులతో పాటు గురువుకు కూడా అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. విద్యార్థులు మొబైల్‌లు, టీవీల మోజులో పడి ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు దూరమవుతున్నారన్నారు.

హోసూరు జోన్

ఘనంగా ముత్తుమారియమ్మ ఆడిమాసం ఉత్సవాలు



హోసూరు ఆగస్టు 10 : హోసూరు మారుతీ నగర్‌లోని శ్రీ ముత్తు మారియమ్మ ఆలయంలో 33వ సంవత్సరం ఆడిమాసం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో శనివారం సాయంత్రం మహిళలు పాల్గొని దీపారాధన చేశారు. శనివారం సాయంత్రం శ్రీ కళాసెల్వి నాటక బృందంచే అర్జునుడి తపస్సు అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్, సెక్రటరీ, పట్టణ పంచాయతీ ప్రజలతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. 10 రోజులకు పైగా జరిగిన ఈ ఉత్సవాల్లో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రా, ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సిలంబం పోటీల్లో సత్తా చాటిన హోసూరు విద్యార్థులు

హోసూరు ఆగస్టు 10 : కృష్ణగిరి జిల్లా సంఘం ఆధ్వర్యంలో 7 వ వార్షిక సిలంబం పోటీలు ఓ ప్రైవేట్ పాఠశాలల్లో జరిగాయి. ఇందులో జిల్లా నలుమూలల నుంచి వంద మందికి పైగా పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా సిలంబం ఇండియా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ .చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ పౌన్‌రామర్, తమిళనాడు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కన్నదాసన్, ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనంగమూడి పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కాశీనాథన్ , రాష్ట్ర నిర్వాహకులు కూడా హాజరయ్యారు. కార్యక్రమానికి వర్ష అధ్యక్షత వహించారు. శబరినాథన్ స్వాగతోపన్యాసం చేశారు. కృష్ణన్, సండూరు, వెంకటాచలపతి, మదన్ లు నాయకత్వం వహించారు. సిలంబం ఇండియన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతిని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు గెలుచుకున్నారు.

వయనాడ్ బాధితులకు రూ.5లక్షల సామగ్రి



వాహనానికి పచ్చజెండా చూపుతున్న జిల్లా కలెక్టర్ సరయు

హోసూరు ఆగస్టు 10: కృష్ణగిరి జిల్లా సిఆర్‌పిఎఫ్ కమాండో యూనిట్ మాజీ పారామిలిటరీ బలగాల సంక్షేమ సంఘం తరఫున, వయనాడ్ బాధితులను ఆదుకునేలా వంటపాత్రలు, టార్పాలిన్, దుప్పట, వస్త్రాలు, మాస్కులు, క్రిమిసంహార మందులు, రూ.5,15,400 విలువైన వస్తువులను మినీ లారీలో పంపడానికి సిద్ధం చేశారు. ఈ వాహనానికి కలెక్టర్ కె.ఎం.సరయు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కావేరిపట్నం పంచాయతీ యూనియన్ కల్లుట్టపట్టి వినాయక మెట్రిక్యులేషన్ సెకండరీ పాఠశాల విద్యార్థులు రూ.22,360 చెక్కును జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయుకు అందచేశారు. జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ రామజయం, మాజీ ఆర్మీ వెటరన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, వినాయక మెట్రిక్యులేషన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శేఖర్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సిలంబం పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులు

ఆలయానికి వెళుతూ మృత్యు ఒడిలోకి

●తల్లి దుర్మరణం, కూతురుకి తీవ్ర గాయాలు

రాయచూరు, ఆగస్టు 10 : శ్రావణ శనివారం కూతురుతో కలిసి దైవ దర్శనం చేసుకుందామని కాలినడకన వెళుతున్న అభాగ్యురాలిని రోడ్డుప్రమాదం పొట్టనపెట్టుకుంది. వెనక నుంచి వస్తున్న వ్యాన్ వేగంగా తల్లీకూతుళ్లను ఢీ కొట్టడంతో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా బిడ్డకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ హృదయవిదారక సంఘటన శనివారం ఉదయం జిల్లాలోని లింగసుగూరు తాలూకా నాగలాపూర సమీపంలో చోటు చేసుకుంది. లింగసుగూరు తాలూకా వ్యాస నందిహాళ్ గ్రామానికి చెందిన భాగ్యమ్మ(35)తన కూతురుతో కలిసి హనుమాన్ ఆలయానికి రోడ్డుపై నడుచుకుంటు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ముదగల్ పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్ట్ మార్టంకోసం తాలూకా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స కోసం ఆస్పత్రికి పంపారు. ముదగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన భాగ్యమ్మ(ఫైల్)

న్యాయవాదులు విధిగా క్రీడల్లో పాల్గొనాలి

న్యాయాధికారి మారుతి బగాడె

రాయచూరు, ఆగస్టు 10 : వృత్తి జీవితంలో అనేక ఒత్తిడులకు గురయ్యే న్యాయవాదులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక స్వాంతన పొందాలని జిల్లా ప్రధాన ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయాధికారి మారుతి బగాడె సూచించారు. జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్వహించిన క్రికెట్ క్రీడాపోటీలను న్యాయాధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన న్యాయాధికారి మారుతి బగాడె, న్యాయవాదులకు ప్రతినిత్యం ఎదురయ్యే పోటీతత్వంతో పాటు క్రీడస్ఫూర్తి కూడా అవసరమేనన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవడం క్రీడలతోనే సాధ్యపడుతుందన్నారు.



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న న్యాయాధికారి మారుతి బగాడె

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఎనిడ్ మేరి బ్లైటన్ (జయంతి)



ఆంగ్లంలో బాలసాహిత్యంలో పేరొందిన ఎనిడ్ మేరి బ్లైటన్ 1897 ఆగస్టు 11న లండన్‌లో జన్మించారు. ఆమె రచనలు 1930 నుంచి ఇంతవరకు 600 మిలియన్ కాపీలు అమ్ముడయ్యాయి. ఆమె పుస్తకాలు 90 అంతర్జాతీయంగా భాషలలోకి అనువాదం కావడంతో ఎంతో ప్రసిద్ధి చెందారు. విద్య, ఫాంటసీ, మిస్టరీ తదితర అంశాలపై రచనలు చేశారు. ఒక ఏడాదిలో 50 పుస్తకాలు విడుదలయ్యాయి. మ్యాగజైన్‌లు, దినపత్రికలలో రచనలు ప్రచురితమయ్యాయి. 1968 నవంబరు 28న కన్నుమూశారు.

వినాయకరమ్ (పుట్టినరోజు)



పద్మభూషణ్ గ్రహీత తేటకుడి హరిహర వినాయకరమ్ 1942 ఆగస్టు 11న మద్రాస్‌లో జన్మించారు. విక్కు వినాయక్‌రామ్‌గా పేరొందారు. ఆయన తండ్రి కళై మామణి పురస్కార గ్రహీత టిఎస్ హరిహరశర్మ సంగీత కారుడు, గురువు. పిన్న వయస్సులోనే ఘటం వాద్య కళాకారుడిగా ప్రతిభ చాటారు. 13వ యేటనే శరగోపన్ కచేరీలో తొలి ప్రదర్శన చేశారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్, 2016లో ఎంఎస్ సుబ్బులక్ష్మి శత జయంతి అవార్డు అందుకున్నారు. ఎందరో కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసులకు సహకారం అందించారు.

దువ్వూరి సుబ్బారావు (పుట్టినరోజు)



రిజర్వుబ్యాంకు గవర్నర్‌గా వ్యవహరించిన దువ్వూరి సుబ్బారావు 1949 ఆగస్టు 11న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జన్మించారు. అమెరికాలోని ఓహియో విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్ పట్టా పొందిన ఆయన 1972లో సివిల్ సర్వీసెస్ పరీక్షలలో టాపర్‌గా నిలిచారు. ఆంధ్రా విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డి అందుకున్నారు. నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా, ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2008-13 మధ్య రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా వ్యవహరించారు. ఆర్థిక నిపుణుడిగా వివిధ హోదాలలో కొనసాగారు.

సత్య ప్రమాణానికి రండి..


రాజనాలబండకు పిలవగానే బంగారు కమ్మలు ప్రత్యక్షం



బంగారు కమ్మలతో స్వామివారికి పూజలు చేస్తున్న బాలసుబ్రహ్మణ్యం కుటుంబికులు

చౌడేపల్లె, ఆగస్టు10: 'సత్య ప్రమాణం చేయడానికి చిత్తూరు జిల్లాలోని రాజనాల బండకు రండి' అంటూ కమ్మలు పోగొట్టుకున్న బాధితుడు పిలవగానే నిందితుల్లో వణుకు మొదలైంది. రాత్రికి రాత్రే ఆ కమ్మలు, నగదు మూటకట్టి బాధితుడి ఆటోలో ఉంచి వెళ్లిపోయారు. స్థానికంగానే కాదు.. కర్ణాటక రాష్ట్రంలోనూ రాజనాల బండ పేరు చెబితే అపహరణకు గురైన వస్తువులు ప్రత్యక్షమవుతుండటం గమనార్హం. ఈ ఘటనకు సంబంధించి రాజనాలబండ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ శనివారం మీడియాకు వివరించారు. ఆ ప్రకారం.. కర్ణాటకలోని కొత్తమనగలానికి బాలసుబ్రహ్మణ్యం ఆటో నడుపుకొంటున్నారు. రెండు నెలల కిందట అతడి భార్య చెవి కమ్మలు, మాటీలు ఇంట్లో బీరువాలో పెట్టారు. నెల కిందట చూడగా అవి కనిపించలేదు. చుట్టుపక్కల ఇళ్లవారిని, గ్రామస్తులను విచారించినా ప్రయోజనం లేకుండా పోయింది. గ్రామపెద్దల సూచన మేరకు ఆలయ నిర్వాహకుల వద్ద అనుమతి తీసుకుని ఇటీవల రాజనాల బండలో సత్య ప్రమాణానికి చుట్టు పక్కల ఇళ్లవారిని పిలిచారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి చోరీకి గురైన బంగారు కమ్మలు, రూ.20వేల నగదు గుడ్డలో మూటకట్టి తన ఆటోలో గుర్తు తెలియని వ్యక్తులు ఉంచి వెళ్లిపోయినట్లు బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. మాటీలకు బదులు, వాటి విలువకు సమానమైన డబ్బులు ఆ మూటలో ఉన్నాయన్నారు. స్వామి మహిమతోనే నగలు లభ్యమయ్యాయని అతడి కుటుంబ సభ్యులు శనివారం రాజనాల బండ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నదిలో ఈతకు వెళ్లి బాలుడి మృతి



వీరేశ్(ఫైల్)

రాయచూరు, ఆగస్టు 10 : జిల్లాలోని మాన్వి తాలూకా చీకలపర్వి సమీపంలో తుంగభద్ర నదిలోకి శనివారం ఈతకు వెళ్లిన బాలుడు మృత్యువాతపడ్డాడు. తుంగభద్ర నదికి నీరు ఎక్కువగా వస్తుండడంతో సరదాగా ఈత కోసం వెళ్లిన ఈ బాలుడికి రైతులు తమ వ్యవసాయ పనుల కోసం వేసుకున్న పంప్‌సెట్ పైపులు ఈత సందర్భంగా అడ్డు రావడంతో ఒక్కసారిగా లోతైన నీటిలోకి కూరుకుపోయాడు. దీంతో ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు గుర్తించారు. మృతుడు 13 ఏళ్ల వీరేశ్‌గా గుర్తించారు. ఈ బాలుడు జాతర సందర్భంగా వేరే గ్రామం నుంచి ఇక్కడికి వచ్చి మిత్రులతో కలిసి సరదాగా ఈత కోసం వెళ్లి మృత్యుపాలైనట్లు గ్రామస్థులు వివరించారు.

గంపమల్లయ్యకు తొలి పూజలు

శింగనమల, ఆగస్టు 10: శ్రావణమాసం తొలి శనివారం ప్రసిద్ధి గాంచిన గంపమల్లయ్య మునీశ్వర్‌కు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ పూజారి గుహలో ప్రవేశం సన్నివేశాలను తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మండలంలో ఓ కొండ మీద గుహలో వెలసిన గంపమల్లయ్య మునీశ్వర్ స్వామికి ప్రతి ఏటా శ్రావణ మాసంలో నాలుగు వారాలు భక్తులు మొక్కులు చెల్లిస్తారు. గంపమల్లయ్యస్వామి పూజారి శ్రావణమాసం ప్రతి శనివారం స్వామి వెలసిన చిన్న గుహలోనికి దిగి పూజలు చేయడం ప్రత్యేకత. అయితే 2022లో శ్రావణ మాస పూజల సమయంలో కొండ నుంచి గుహలోనికి ప్రవేశించే సమయంలో పూజారి అదుపుతప్పి జారిపడి మృతి చెందాడు. అప్పటి నుంచి మూడు సంవత్సరాలు పాటు పూజారి కుటుంబ సభ్యులు ఎవరు గుహ ప్రవేశం చేయలేదు. ఈసారి మళ్లీ పూజారి కుటుంబ సభ్యులే గుహ ప్రవేశం చేయడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాలకు శ్రావణ శనివార శోభ



లక్ష్మీవెంకటేశ్వరస్వామికి పూజలు



శిడ్లఘట్టలో స్వామివారికి అలంకరణ



కెరెకోడిలోని శనీశ్వరుడి ఆలయంలో పూజలు



చింతామణి కురుటహళ్ళిలో వీరాంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

శిడ్లఘట్ట, ఆగస్టు 10: శ్రావణమాసం తొలి శనివారం పురస్కరించుకుని పట్టణం సహా తాలూకాలోని పలు ఆలయాలలో విశేషపూజలు కొనసాగడంతో భక్తుల సందడి నెలకొంది. పట్టణంలోని వాసవి రోడ్డులోని లక్ష్మీ వెంకటరమణస్వామి, వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఫిలేచర్ క్వార్టర్స్‌లోని గాయత్రి దేవి ఆలయంలోనూ, కోటె సర్కిల్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలోనూ, చింతామణి రోడ్డులోని యోగి నారేయణ తాత మఠంలోనూ, బెళ్ళూటి గేట్‌లోని వీరాంజనేయస్వామి ఆలయం, చౌడసంద్రలోని వీరాంజనేయస్వామి ఆలయం, తలకాయల బెట్టలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ, పట్టపల్లి ఆంజనేయస్వామి ఆలయంలోనూ విశేషపూజలు సాగాయి. భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. ఎటు చూసినా ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

విజయపురలో...

విజయపుర: దేవనహళ్ళి తాలూకాలోని విజయపుర హోబళి పరిధిలోని పలు దేవాలయాలు శ్రావణ శనివారం నేపథ్యంలో భక్తులతో కిటికిటలాడాయి. హోర్డిపురలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, బలిజపేటలోని వెంకట రమణ స్వామి దేవాలయం, కెరెకోడి సమీపానగల శనైశ్వర, పురద శనైశ్వర, కగ్గలహళ్ళి సమీపంలోని ఆంజనేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి.

చింతామణిలో...

చింతామణి: శ్రావణ శనివారం పురస్కరించుకుని పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. కురుటహళ్ళిలోని వీరాంజనేయస్వామికి పత్తి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

రూపేన అగ్రహారలో...

బొమ్మనహళ్ళి: శ్రావణమాసం తొలి శనివారం పురస్కరించుకుని రూపేన అగ్రహారలోని లక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో విశేషపూజలు జరిగాయి. సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, స్వామి వారికి అలంకరణ జరిపారు. అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ జీర్ణోద్ధరణ చేశాక శ్రావణమాసం రావడంతో స్వామివారికి ప్రత్యేక పూజలు కొనసాగాయి. ప్రధాన అర్చకులు కృష్ణభట్ మాట్లాడుతూ ఆలయ జీర్ణోద్ధరణతో భక్తులకు మెరుగైన సదుపాయాలు సాధ్యమయ్యాయన్నారు. స్వామివారికి అభిషేకం కల్పించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఆలయంలో గణపతి, ఆంజనేయస్వామి, గాయత్రిమాత, శనైశ్వరుడి విగ్రహాలు ఉండడంతో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. ఆలయ దాతల దివంగత గోపాలరెడ్డి భార్య కమలమ్మ, కుమారుడు నరేంద్రబాబు ప్రత్యేక పూజల్లో



శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి ప్రాకారోత్సవం

పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు.

చార్టెడ్ అకౌంటెంట్లు సమాజాన్ని చైతన్యం చేయాలి

» బీజేపీ ఎంపీ డాక్టర్ మంజునాథ్



సదస్సులో ఎంపీ, పద్మశ్రీ డాక్టర్ సీఎన్ మంజునాథ్‌కు సన్మానం

బెంగళూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రెండు మూడు దశాబ్దాలతో పోలిస్తే ఆదాయం పెరిగినవారి సంఖ్య గణనీయమైందని సమాజంలో చైతన్యం తీసుకొచ్చేందుకు చార్టెడ్ అకౌంటెంట్‌లు కృషి చేయాలని బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. ఇండియన్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) దక్షిణభారత ప్రాంతీయమండలి 56వ సమ్మేళనం ప్యాలెస్ గ్రౌండ్‌లో నిర్వహించింది. దక్షిణాదిరాష్ట్రాల చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు గీతా ఏబీ అధ్యక్షత వహించారు. ఏబీ ప్రమోద్‌కుమార్ హెగ్డే, కర్ణాటక - గోవా రాష్ట్రాల ఐటీ కమిషనర్ షెల్లీ జిందాల్, డీఆర్‌డీఓకు చెందిన డాక్టర్ బినోద్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్ మాటాడుతూ జిజ్ఞాస పేరిట సదస్సు నిర్వహించడం సంతోషం కలిగించిందన్నారు. జిజ్ఞాస అంటే కుతూహలమని చార్టెడ్ అకౌంటెంట్‌లలోనూ అందుకు తగిన ఉత్సాహం అవసరమేఅన్నారు. మారుతున్న చట్టాలు, నిబంధనలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆర్థికపరమైన ఇబ్బందులు, నేరాలు పెరగకుండా ఉండాలంటే అవగాహన పెంచాలన్నారు. ఉద్యోగం, వ్యాపారంలో ఆదాయాన్ని గడించేవారు తమ ఖాతాలను, ఆదాయ వివరాలను సమగ్రంగా సమర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. రెండు రోజుల సదస్సులో ఎంఎన్‌సీ కంపెనీల హెచ్‌ఆర్‌లు జీఎస్టీ, ఫెమా, ఐటీ, సాంకేతిక సమాచారం వంటి అంశాలపై చర్చాగోష్టులు సాగాయి.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన



ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు ..

శిడ్లఘట్ట, ఆగస్టు 10: తాలూకాలోని మేలూరు సెయింట్‌థామస్ స్కూల్‌లో మాక్ పార్లమెంట్‌లో భాగంగా ఎన్నికలు నిర్వహించారు. 9మంది అభ్యర్థులు బరిలో ఉండగా ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు 103మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునే విధానంతో స్నేహితులను ఓటు వేయాలని ప్రోత్సహించారు. ఇందుకు నాలుగు రోజులుగా ఉపాధ్యాయులు ప్రక్రియ నిర్వహించి పిల్లలకు అవగాహన కల్పించారు. పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రగతిలో భాగంగా అజెండాను రూపొందించామని తమకు ఓటు వేయాలని అభ్యర్థులు కోరారు. విద్యార్థులు ఉత్సాహంగా ఓటు వేశారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని గహన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఓటు వేయడం తప్పనిసరి అన్నారు. 18ఏళ్లు నిండినవారు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. తొమ్మిదో తరగతి ధన్యశ్రీ మాట్లాడుతూ ఓటు మన కర్తవ్యమని, డబ్బు తీసుకుని ఓటు వేయరాదన్నారు. అవినీతిలేని ఎన్నికలకు మనందరం చేయి కలపాలన్నారు. అభ్యర్థులు ఎవరూ ఇష్టం లేకుంటే నోటాకు ఓటు వేయాలన్నారు. పదో తరగతి విద్యార్థి పూర్ణ మాట్లాడుతూ దేశాభివృద్ధికి లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు జరుగుతాయని ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పాఠశాల పాలనాధికారి జోస్ థామస్ మాట్లాడుతూ విద్యాశాఖ నియమావళి ప్రకారం పాఠశాలలో మాక్‌పార్లమెంట్ నిర్వహించామన్నారు. చిన్న వయస్సు నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా ఎన్నికలు దోహదపడతాయన్నారు. ఎన్నికల్లో 9మందికిగాను ఇద్దరు గెలుపొందారని వారిని అభినందించినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు నరసింహరెడ్డి, శివప్ప, రాజేశ్, రజని, చైత్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించండి



దివ్యాంగులకు కాలిపర్స్, వీల్‌చెయిర్ అందజేత

బంగారపేట, ఆగస్టు 10: సమాజంలో దివ్యాంగులను కూడా ఇతరుల మాదిరిగా ఆదరించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని స్వాభిమాన దివ్యాంగుల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు హెన్రిజోసెఫ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దాసరహొసహళ్ళిలో మిషనరీ బెథెల్ చర్చ్‌లో సంఘం ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగులకు వీల్‌చెయిర్, వాటర్‌బెడ్, క్యాలిపర్స్ ఇతర ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. జోసెఫ్ మాట్లాడుతూ యుడిఐడి గుర్తింపుకార్డు ద్వారా ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టాలలో ఉన్నవారికి చేతనైన సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో గుడ్సన్ ఫౌండేషన్ పీఆర్‌ఓ హరీశ్, బెథెల్ చర్చ్‌కు చెందిన సైమన్ ఫ్రాంక్, వినోద్, భువనేశ్వరి, చలపతి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనానికి అందరూ సహకరించాలి



మొక్కలు నాటుతున్న సంస్థ ప్రముఖులు తదితరులు

శిడ్లఘట్ట, ఆగస్టు 10: సమాజంలో పచ్చదనం పెంపు కోసం అందరూ సహకరించాలని నిర్వాహకులు పేర్కొన్నారు. సాధ్య లైఫ్ ఎంపవర్ ట్రస్టు, స్వామి వివేకానంద దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. తాలూకాలోని చీమంగల గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మైదానంలో 20 మొక్కలు నాటారు. స్వామి వివేకానంద సేవా సంస్థ అధ్యక్షుడు లక్ష్మినారాయణ మాట్లాడుతూ 13ఏళ్లుగా దివ్యాంగులు, మహిళలు, యువ మానవ వనరుల అభివృద్ధికోసం విద్య, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, కౌశాల్యాభివృద్ధి తరగతులను స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్నాయన్నారు. చిక్కబళ్ళాపుర, కోలారు, బెంగళూరు నగర, గ్రామీణ జిల్లాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థుల మానసిక పరివర్తనకోసం హౌటు మేనేజ్ యువర్ టీనేజ్ పేరిట వ్యక్తిత్వ వికాస తరగతులను ఉచితంగా నిర్వహిస్తోం దన్నారు. అలాగే వంటగ్యాస్ వాడకంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. యువతను ప్రోత్సహించేలా చేంజ్ మేకర్స్ ఆర్మీ పేరిట సమాజసేవలు అందిస్తున్నారు. సంస్థ జిల్లా కన్వీనర్ నీలురామ్, చింతామణి తాలూకా కన్వీనర్ ఆనంద్, కైవార హోబళికి చెందిన అంజినప్ప, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

గంగాంబిక ఆలయ వార్షికోత్సవం



నవచండికా హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చింతామణి, ఆగస్టు 10: పట్టణంలోని ఊలవాడి రోడ్డులోని గంగానగర్‌లో వెలసిన ఉద్భవ గంగాంబికె ఆలయంలో శ్రావణ తొలి శనివారంతోపాటు ఏడో వార్షికోత్సవంలో భాగంగా విశేషపూజలు జరిగాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. హోమాది హవనాలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం గణపతి పూజ, దేవతా ప్రార్థన, స్వస్తి పుణ్యావాచన, వాస్తు హోమం, కళశారాధన, గణపతి హోమం, దత్తాత్రేయస్వామి హోమం తదితర కైంకర్యాలతోపాటు లఘు పూర్ణాహుతి, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శనివారం ఉదయం పూజాకైంకర్యాల అనంతరం మహాచండికా హోమం నిర్వహించారు. విశేషపూజల్లో ఆలయ ట్రస్టు సంస్థాపకులు వెంకటాచలమయ్య, బాలాజి బస్సు యజమాని జెవి గోపి, శివగణేశ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజుల

మహదేవపుర, ఆగస్టు 10: నియోజకవర్గంలోని కణ్ణూరు గ్రామంలో బెళ్ళహళ్ళి క్రాస్ నుంచి మైలనహళ్ళికి చెందిన రాష్ట్ర రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంజుళ లింబావళి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడువులోగా పనులు పూర్తి చేయాలని కంట్రాక్టర్‌లకు సూచించారు. నాణ్యతను పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం సవతితల్లి ధోరణితో వ్యవహరించడంతో నియోజకవర్గానికి తగినన్ని గ్రాంట్లు రావడం లేదన్నారు. రానున్న రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కణ్ణూరు పంచాయతీ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షురాలు లలితా దేవరాజ్, సభ్యులు బండె హోసూరు సుందర్, ప్రముఖులు మోహన్ రెడ్డి, నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

టీజే అబ్రహాంపై చార్జ్‌షీట్

బెంగళూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మహిళా కేఏఎస్ అధికారిని నగదుకోసం వేధించారనే ఆరోపణలతో ముఖ్యమంత్రిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త టి.జె. అబ్రహాంపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అధికారి సుధాకు వ్యతిరేకంగా అబ్రహాం లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంలో ఇబ్బంది కలిగించకుండా ఉండడంతోపాటు కేసును ముందుకు కొనసాగించకుండా ఉండేందుకు అబ్రహాం డీల్‌కు పాల్పడ్డారని సునిల్ అనే వ్యక్తిని మధ్యవర్తిగా వ్యవహరించారని అధికారి ఫిర్యాదు చేశారు. అబ్రహాం, సునిల్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు కాగా ముందస్తు బెయిల్ పొందారు. వీరిద్దరికీ జీవనబీమానగర్ పోలీసులు విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. కాల్ డిటైల్స్, వాయిస్, వీడియోలను ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. ఈమేరకు ఎఫ్ఎస్ఎల్ నుంచి వివరాలు పొందినట్లు తెలుస్తోంది. మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో సీఎం సిద్దరామయ్య భార్యకు 14 ఇంటి స్థలాల కేటాయింపులో అక్రమం ఉందని అబ్రహాం నేరుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సీఎం సిద్దరామయ్యను విచారణ జరపాలని టిజె అబ్రహాం గవర్నర్‌కు ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే గవర్నర్ స్పందించి సీఎంకు నోటీసులు జారీ చేశారు. ఈ వివాదం తీవ్రమైన పరిణామాలకు దారితీసిన సమయంలోనే టి.జె.అబ్రహాం, సునిల్‌లపై శుక్రవారం చార్జ్‌షీట్‌లు దాఖలు చేశారు.

పెద్దలు అంగీకరించలేదని ప్రేమికుల ఆత్మహత్య

బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్దలు అంగీకరించలేదని ఒకే చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాగల్కోటె జిల్లాలో చోటు చేసుకుంది. రబకవి బనహట్టి తాలూకా నందగావ్ గ్రామానికి చెందిన సచిన్ దళవాయి (22), ప్రియా మడివాళ (20)ఆత్మహత్యకు పాల్పడినవారు. వీరిద్దరూ చాలాకాలంగా ప్రేమలో ఉన్నారు. పెళ్ళి చేసుకుని కొత్త జీవనాన్ని ప్రారంభించాలని భావించారు. సచిన్ కుటుంబీకులు పెళ్లికి అంగీకరించలేదు. గురువారం రాత్రి గ్రామ శివారులోని ఒకే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మహాలింగపుర పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసుకున్నారు.

నిండుకుండలా తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్, ఆగస్టు 10: తుంగభద్ర జలాశయం నిండుకుండలా ఉంది. 1633 అడుగులతో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో శనివారం సాయంత్రానికి నాటికి 1633 అడుగులతో 105 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరదనీరు వచ్చి చేరుతోంది. 40,925 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుతోంది. దీంతో 10 క్రస్ట్‌గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి నది 20,119 క్యూసెక్కులు, 15,370 క్యూసెక్కులు నీటిని కాలువలకు వదులుతున్నారు. బొమ్మనహాళ్ సరిహద్దులోని హెచ్చెల్సీ 105వ కి.మీ. వద్ద 1310 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

జీడిపల్లికి ఇన్‌ఫ్లో 112 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 10: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం 112 క్యూసెక్కుల కృష్ణాజలాల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి నిల్వ 0.263 టీఎంసీలు ఉందన్నారు.